సాక్షి ఆదిలాబాద్

శనివారం । 17 । జూన్ । 2023



ముద్రణ.. సరికొత్తగా..

ప్రభుత్వ పాఠశాలల్లో పాఠ్యపుస్తకాలు పంపిణీ చేస్తున్నారు. ఈసారి పుస్తకాలు నాణ్యతగా ఆయిల్ ప్రింట్‌తో ఆకట్టుకుంటుండగా విద్యార్థులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. 8లో▸



శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

ఎదులాపురం: న్యాక్ ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని ఏఎల్‌వో రాజలింగు అన్నారు. జిల్లా కేంద్రంలోని న్యాక్ శిక్షణ కేంద్రాన్ని శుక్రవారం ఆయన సందర్శించారు. కార్మికశాఖ అధికారి వినోద్, ఏడీ నాగేంద్రం తదితరులున్నారు.

వాతావరణం

గరిష్టం/కనిష్టం
42.0 /29.0

వాతావరణం పొడిగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండ తీవ్రత పెరగనుంది. వడగాలులు వీస్తాయి. ఉక్కపోత ప్రభావం అధికంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

రెవెన్యూ వృద్ధిలో బల్దియా నంబర్‌వన్



మంత్రి కేటీఆర్ నుంచి అవార్డు అందుకుంటున్న మున్సిపల్ చైర్మన్ ప్రేమేందర్, కమిషనర్ శైలజ

కైలాస్‌నగర్: రాష్ట్ర అవతరణ దశాబ్ది వేడుకలు పురస్కరించుకుని ఉత్తమ సేవలందించిన మున్సిపాలిటీలకు రాష్ట్ర ప్రభుత్వం అవార్డులను ప్రకటించింది. ఇందులో భాగంగా రెవెన్యూ విభాగంలో సాధించిన వృద్ధికి గాను ఆదిలాబాద్ బల్దియాకు నంబర్‌వన్ స్థానం దక్కింది. ఏడాదిలో వసూలైన పన్నులు, ఆన్‌లైన్‌లో ధ్రువీకరణ పత్రాల రిజిస్ట్రేషన్ విభాగంలో లక్షకు పైగా జనాభా కేటగిరీలో ఈ అవార్డు దక్కింది. ఈ మేరకు హైదరాబాద్‌లోని శిల్పాకళా వేదికలో శుక్రవారం నిర్వహించిన రాష్ట్రస్థాయి పట్టణ ప్రగతి దినోత్సవంలో ఈ అవార్డు అందజేశారు. రాష్ట్ర పట్టణాభివృద్ధి, మున్సిపల్, ఐటీశాఖ మంత్రి కేటీఆర్ చేతుల మీదుగా చైర్మన్ జోగు ప్రేమేందర్, కమిషనర్ శైలజ ఈ అవార్డు అందుకున్నారు. చైర్మన్‌ను శాలువాతో సత్కరించడంతో పాటు జ్ఞాపిక అందజేసి మంత్రి అభినందనలు తెలిపారు.

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలి



జీపుజాతను ప్రారంభిస్తున్న భాస్కర్

ఎదులాపురం: అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలమడుగు భాస్కర్ డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారం కోసం తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సీఐటీయూ అనుబంధం) ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్త జీపుజాతకు శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా జిల్లా కేంద్రంలోని పీఆర్టీయూ భవన్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జీపుజాతను ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఐసీడీఎస్ బలోపేతం, అంగన్‌వాడీ సమస్యల పరిష్కారంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి రమేశ్, అంగన్వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర కోశాధికారి సునీత, సీఐటీయూ జిల్లా అధ్యక్షు, కార్యదర్శులు ఆశన్న, కిరణ్, నాయకులు సోమన్న, మల్లేష్, వెంకటమ్మ తదితరులు పాల్గొన్నారు.

'చౌక్‌ల అభివృద్ధితో సామాన్యులకు ఒరిగేదేమీ లేదు'



కరపత్రాలు పంపిణీ చేస్తున్న సుహాసినిరెడ్డి

జైనథ్: ఆదిలాబాద్ పట్టణంలోని చౌక్‌ల సుందరీకరణతో సామాన్యులకు ఒరిగేదేమి లేదని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు సుహాసినీరెడ్డి విమర్శించారు. మండలంలోని కూర గ్రామాన్ని శుక్రవారం ఆమె సందర్శించి, కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పలు సంక్షేమ పథకాలను కరపత్రాలు ద్వారా గ్రామస్తులకు వివరించారు. గ్రామాల్లో ప్రజలు కనీస సౌకర్యాలు లేక ఇబ్బందులు పడుతున్నారని, కేవలం పట్టణంలో చౌక్‌లను సుందరీకరించినంత మాత్రాన సామాన్యుల బతుకులు మారవని అన్నారు. రతన్‌రెడ్డి తదితరులున్నారు.

ఉద్యోగాల పేరిట మహిళ టోకరా

- 20 మంది నుంచి రూ.70లక్షల వరకు వసూలు

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ పట్టణంలో బొక్కలగూడకు చెందిన ఓ మహిళ రైల్వే శాఖలో ఉద్యోగాలు ఇప్పిస్తానంటూ నిరుద్యోగులకు టోకరా వేసింది. దాదాపు 20 మంది నుంచి రూ.70 లక్షల వరకు వసూలు చేసినట్లు సమాచారం. గతేడాదిగా బాధితుల నుంచి డబ్బులు వసూలు చేసి వారి నుంచి తప్పించుకుంటూ తిరుగుతుంది. ఈక్రమంలో బాధితులు వన్‌టౌన్ పోలీసులను ఆశ్రయించారు. శుక్రవారం రాత్రి సదరు మహిళను అరెస్టు చేసి విచారిస్తున్నట్లు సీఐ సత్యనారాయణ తెలిపారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

ప్రైవేట్.. దోపిడీ!

- ఆదిలాబాద్ పట్టణంలోని అశోక్ రోడ్‌లో ఓ బుక్‌స్టాల్ ఉంది. జిల్లా కేంద్రంలోని దాదాపు అన్ని పాఠశాలల యాజమాన్యాలు ఇక్కడే పుస్తకాలు కొనుగోలు చేయాలని విద్యార్థులకు చెబుతాయి. ఇక్కడ తప్ప మరో బుక్‌స్టాల్‌లో ఆ పుస్తకాలు దొరకవు. ఒకటో తరగతి విద్యార్థికి ఐదారు నోట్‌బుక్‌లు, నాలుగైదు పాఠ్య పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లు, పుట్టలు అన్నీ కలిపి రూ.3 వేల నుంచి రూ.5 వేల వరకు వసూలు చేస్తున్నారు ఇక్కడ. గత్యంతరం లేక భారమైనా తీసుకోక తప్పడం లేదని తల్లిదండ్రులు వాపోతున్నారు.
- ఆదిలాబాద్ పట్టణం గాంధీచౌక్‌లో ఉన్న ఆ షాపులో మాత్రమే యూనిఫాం విక్రయిస్తారు. పాఠశాలల యాజమాన్యాలు విద్యార్థులకు విజిటింగ్ కార్డు ఇచ్చి మరీ అక్కడకు వెళ్లమంటారు. అక్కడ వారు చెప్పిందే రేటు. ఇష్టముంటే తీసుకోండి.. లేకుంటే లేదనే తీరులో సమాధానమిస్తారు నిర్వాహకులు. ఇందులో ఆంతర్యం లేకపోలేదు. ఇటు పుస్తకాలు, అటు యూనిఫాం విక్రయాల్లో వీరు సంబంధిత పాఠశాలల యాజమాన్యాలకు భారీ మొత్తంలో కమీషన్లు ముట్టచెబుతారని సమాచారం.

- పాఠశాలల్లో ఇష్టానుసారం ఫీజుల వసూళ్లు
- పాఠ్యపుస్తకాలు, యూనిఫాం సైతం విక్రయాలు
- కమీషన్లకు కక్కుర్తిపడుతున్న యాజమాన్యాలు
- అయినా పట్టించుకోని విద్యాశాఖ
- తల్లిదండ్రులపై మోయలేని భారం



పట్టణంలోని ఓ బుక్‌స్టాల్‌లో పుస్తకాలు కొనుగోలు చేస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులు



ఆదిలాబాద్‌టౌన్/బోథ్: జూన్ వచ్చిందంటే చాలు తల్లిదండ్రుల్లో ఆందోళన మొదలవుతోంది. ఓ వైపు సాగు పెట్టుబడి.. మరోవైపు బడి పిల్లల చదువుకు పుస్తకాలు, ఫీజుల మోత కలిపి పేద, మధ్య తరగతి కుటుంబాలపై ఆర్థిక భారం పడుతుంది. వానాకాలం సీజన్ రాకతో సాగుకు విత్తనాలు, ఎరువులు అవసరం కానుండగా.. ఇటు పిల్లల పుస్తకాలు, యూనిఫాం తదితరాలు కొనుగోలు చేయక తప్పదు. ఎంత ఖర్చయినా సరే తమ పిల్లలను బాగా చదివించాలన్న తల్లిదండ్రుల ఆశలను తమకు అనుకూలంగా మార్చుకుంటున్న ప్రైవేట్ యాజమాన్యాలు అందిన కాడికి దండుకుంటున్నాయి. చదువు నేర్పాల్సిన విద్యాలయాలు సూపర్ మార్కెట్ల మాదిరిగా దర్శనమిస్తున్నాయి. కార్పొరేట్‌తో పాటు ప్రైవేట్ పాఠశాలల్లో ఏటా వేలకు వేలు ఫీజులు వసూలు చేస్తున్నాయి. జీవో 1కి తూట్లు పొడుస్తూ విద్యా హక్కు చట్టాన్ని తుంగలో తొక్కుతున్నాయి. విద్యాశాఖ పట్టింపులేమితో వీరి 'ఫీ'జులుం సాగుతోందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

వీధికో బడి..

జిల్లాలో మొత్తం ప్రైవేట్ పాఠశాలలు 167 ఉన్నాయి. ఇందులో 37,640 మంది విద్యార్థులు చదువుతున్నారు. ప్రస్తుతం ప్రైవేట్‌తో పాటు కార్పొరేట్ పాఠశాలలు వీధికొకటిగా ఏర్పాటు చేస్తున్నారు. ఎల్‌కేజీ, యూకేజీ చదువుకే ఏడాదికి రూ.25 వేలు వసూలు చేస్తున్నారు. ఈ–టెక్నో, బీజీ, మోడల్, కాన్సెప్ట్, టెక్నో, గ్రామర్, ఐఐటీ, నీట్, జేఈఈ వంటి తోక పేర్లు తగిలిస్తూ తల్లిదండ్రుల బలహీనతను సొమ్ము చేసుకుంటున్నారు. నిబంధనల ప్రకారం విద్యార్థులకు అడ్మిషన్ ఫీజు తీసుకోకూడదు. అయినా చాలా చోట్ల ఇష్టారీతిన వసూలు చేస్తున్నారు. మరోవైపు ఇందులో పైపై మెరుగులే తప్ప వసతులు ఉండడం లేదనే ఆరోపణలున్నాయి. ఇరుకు గదులతో పాటు విద్యార్థులకు సరిపడా ఉండని మరుగుదొడ్లు, క్రీడా మైదానం లేని పాఠశాలలు అనేకం ఉన్నాయి. అయినా ఫీజుల వసూలులో మాత్రం వీరు వెనుకాడడం లేదు. కరోనా సమయంలోనూ తల్లిదండ్రుల నుంచి ముక్కు పిండి మరీ వసూలు చేయడం గమనార్హం.

ఫీజుల వివరాలు ఇలా..

తరగతి	ఫీజు (రూ.లలో)
ఎల్‌కేజీ	15,000–18,000
యూకేజీ	20,000– 22,000
ఒకటి	20,000– 23,000
రెండు	22,000– 25,000
మూడు	25,000– 30,000
నాలుగు	25,000– 35,000
ఐదు	30,000– 40,000
ఆరు	35,000– 42,000
ఏడు	40,000– 45,000
ఎనిమిది	42,000– 48,000
తొమ్మిది	45,000– 50,000
పది	50,000– 55,000

సూపర్ మార్కెట్లలా..

ప్రైవేట్ పాఠశాలల దోపిడీ మితిమీరుతుంది. పాఠ్య పుస్తకాలు, నోటుబుక్కులు, టై, బెల్టు, షూ ఇలా అన్ని తమ వద్దే కొనుగోలు చేయాలని యజమాన్యాలు విద్యార్థుల తల్లిదండ్రులపై ఒత్తిడి తెస్తున్నాయి. ఇందుకోసం ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేస్తున్నాయి. వేలకువేలు డొనేషన్లు.. అదే స్థాయిలో ఫీజులు దండుకుంటున్నా సరిపోదన్నట్టు వీటిని సైతం విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నాయి. మరికొన్ని పాఠశాలలు తమకు అనుకూలంగా ఉన్న బుక్‌స్టాల్స్ వద్ద మాత్రమే కొనుగోలు చేయాలని చీటీలు రాసిస్తున్నారు. అక్కడ పుస్తకాల రేటు వింటే నోరెళ్లబెట్టాల్సిందే. ఒకటో తరగతి పిల్లలకు కనీసం రూ.3 వేల నుంచి రూ.5 వేల వరకు ఉంటాయి మరి. గత ఏడాది విద్యార్థి సంఘాల ఆందోళన సమయంలో విద్యాశాఖ అధికారులు నామమాత్రంగా తనిఖీలు చేపట్టారు. ఓ పాఠశాలలో పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్కులను సీజ్ చేసినప్పటికీ వారిపై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం గమనార్హం.

పుస్తకాలొచ్చాయని మెసేజ్ పెట్టారు



నాకు ఇద్దరు పిల్లలున్నారు. పెద్ద పాప పట్టణంలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో ఒకటో తరగతి చదువుతుంది. పాఠ్యపుస్తకాలు, నోటు పుస్తకాలు వచ్చాయని ఫోన్‌కు మెసేజ్ చేశారు. స్కూల్‌కు వెళ్లి కొనుగోలు చేశా. ఒకటో తరగతికి రూ.25 వేల ఫీజు ఉంది. పేదలకు ఈ ఫీజులు భారంగా ఉన్నాయి. వీటిని ప్రభుత్వమే నియంత్రించాలి.

– బైనమ్‌వార్ సాయి, మావల

అధిక ఫీజులు అరికట్టాలి



ప్రైవేట్, కార్పొరేట్ యాజమాన్యాలు తల్లిదండ్రులను దోపిడీకి గురి చేస్తున్నాయి. ఇష్టానుసారం అధిక ఫీజులు వసూలు చేస్తున్నాయి. అంతేకాకుండా కమీషన్లకు కక్కుర్తిపడి పాఠ్య పుస్తకాలు, నోట్‌బుక్‌లు సైతం విక్రయిస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి పాఠశాలలను తనిఖీ చేసి చర్యలు తీసుకోవాలి. లేకుంటే ఆందోళనలు చేపడతాం.

– కొత్తూరి ప్రవీణ్, టీజీవీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రెటరీ

విద్యాశాఖ స్పందించాలి



ప్రైవేట్ పాఠశాలల్లో అధిక ఫీజులు వసూలు చేస్తున్నారు. అలాగే బడుల్లోనే నిబంధనలకు విరుద్ధంగా పుస్తకాలు, యూనిఫాం, టై, బెల్టుల విక్రయిస్తున్నారు. విద్యాశాఖ అధికారులు వెంటనే స్పందించాలి. లేకుంటే విద్యార్థుల పక్షాన ఆందోళనలు చేపడతాం.

– సుమేర్, ఏఐఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షుడు

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు



ప్రైవేట్ పాఠశాలల్లో పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్‌లు, యూనిఫాం వంటివి విక్రయించొద్దు. నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవు. విద్యాశాఖ అనుమతించిన బుక్‌స్టాళ్లలోనే పాఠ్యపుస్తకాలు విక్రయించాలి. ఎక్కువ ధరకు విక్రయిస్తే చర్యలు తీసుకుంటాం.

– ప్రణీత, జిల్లా విద్యాశాఖ అధికారి

ఆసిఫాబాద్ నుంచే 'పోడు' పంపిణీ?



ఆసిఫాబాద్‌లో సభాస్థలాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ హేమంత్ బోర్కడే, ఎమ్మెల్యే సక్కు

- 24న సీఎం చేతుల మీదుగా ప్రారంభం
- బహిరంగ సభలోనే పట్టాలు ఇచ్చేందుకు ఏర్పాట్లు
- నాలుగైదు రోజుల్లో స్పష్టత వచ్చే అవకాశం

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: సుదీర్ఘ కాలంగా పెండింగ్‌లో ఉన్న పోడు పట్టాల పంపిణీకి రంగం సిద్ధమవుతోంది. ఈ నెల 24నుంచే ప్రారంభిస్తామని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. ఇదే రోజున సీఎం కేసీఆర్ కుమురంభీం జిల్లా కేంద్రం ఆసిఫాబాద్‌కు రానున్నారు. కొత్త సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం, జిల్లా పోలీసు కార్యాలయం, బీఆర్‌ఎస్ పార్టీ జిల్లా కార్యాలయం, కుమురంభీం విగ్రహం, మాజీ మంత్రి కొట్నాక భీంరావు విగ్రహ ఆవిష్కరణ చేపట్టనున్నారు. అనంతరం భారీ బహిరంగ సభ నిర్వహించనున్నారు. ఈ క్రమంలో బహిరంగ సభ నుంచే పోడు పట్టాల పంపిణీ లాంఛనంగా సీఎం కేసీఆర్, గిరిజన ప్రజాప్రతినిధులు, నాయకుల సమక్షంలో మొదలయ్యే అవకాశంఉంది. ఈ మేరకు సభ నిర్వహణకు ఏర్పాట్లు సాగుతున్నాయి. ఇప్పటికే కొత్త సచివాలయం ప్రారంభోత్సవం సందర్భంగా పోడు పట్టాలు అందజేస్తామని ఫైల్‌పై సంతకం చేశారు. రాష్ట్రంలో పోడు సాగు చేసుకునే వారికి జిల్లాల వారీగా సభలు నిర్వహించి ఎక్కడికక్కడ ప్రజాప్రతినిధులు, అధికారుల సమక్షంలో లబ్ధిదా రులకు పట్టాలు పంపిణీ చేస్తామని తెలిపారు. ఈ క్రమంలో అటవీ భూముల్లో పోడు అధికంగా సాగు చేస్తున్న జిల్లాల్లో భద్రాద్రికొత్తగూడెం, మహబూబాబాద్, కుమురంభీం, ఆదిలాబాద్, ములుగు, నిర్మల్ ఉన్నాయి. రాష్ట్రంలో మొదటి ఆరు జిల్లాల్లో ఉమ్మడి జిల్లా నుంచే మూడు జిల్లాల్లో ఎక్కువ మంది గిరిజన లబ్ధిదారులు ఉన్నారు. దీంతో ఇక్కడి నుంచే పోడు పట్టాలు పంపిణీ ప్రారంభించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఈ మేరకు సీఎం భద్రతా పరంగా ఎటువంటి అవాంతరాలు రాకపోతే ఆసిఫాబాద్ పర్యటనలోనే పట్టాలు అందనున్నాయి. మరోవైపు కొందరు ఆదివాసీ నాయకులు ఇక్కడి నుంచే పట్టాలు ఇవ్వాలని కోరుతున్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో 37వేల మందికి, లక్ష ఎకరాల అటవీ భూములకు హక్కు పత్రాలు ఇచ్చేందుకు ప్రణాళిక సిద్ధమైనట్లు తెలుస్తోంది.

ఈశాన్యం సెంటిమెంట్..

తెలంగాణ రాష్ట్రానికి భౌగోళికంగా కుమురంభీం, మంచిర్యాల జిల్లాలు ఈశాన్యంలో ఉన్నాయి. ఆ సెంటిమెంట్ ప్రకారం కూడా ఇక్కడి నుంచే పోడు పంపిణీ ప్రారంభమయ్యే అవకాశాలు ఉన్నాయి. ఇటీవల మంచిర్యాల జిల్లా పర్యటనలో కొత్త కలెక్టరేట్ ప్రారంభంతోపాటు మూడు కొత్త పథకాలు ప్రారంభించారు. ఎంబీసీ కులాలకు రూ.లక్ష సాయం, సొంత జాగా ఉన్నవారికి ఇంటి నిర్మాణం కోసం రూ.3లక్షల సాయం, రెండో విడత గొర్రెల పంపిణీ, వీటితోపాటు దివ్యాంగులకు నెల పింఛన్ మరో వెయ్యి పెంచుతున్నట్లు ప్రకటించారు. ఈశాన్య ప్రాంతంలో ఉన్న ఈ ప్రాంతం నుంచే సంక్షేమ పథకాలు ప్రారంభిస్తున్నట్లు స్వయంగా సీఎం తెలిపారు. ఈ క్రమంలో కుమురంభీం జిల్లా పర్యటనలో నిర్వహించనున్న బహిరంగసభ నుంచే పలు ప్రారంభోత్సవాలు చేస్తూ, గిరిజనులకు పోడు పట్టాలు ఇచ్చే ఏర్పాట్లు చేసినట్లు సమాచారం. ఇప్పటికీ అధికారికంగా, ప్రజాప్రతినిధులకు స్పష్టమైన సమాచారం లేదు. కానీ బహిరంగ సభకు మాత్రం అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. రెండు నియోజకవర్గాల పరిధిలో ఉన్న అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనల వివరాలు అధికారులుతీసుకుంటున్నారు. నాలుగైదు రోజుల్లో సీఎం పర్యటనపై స్పష్టత రానుంది.

కార్పొరేషన్ తరహాలో పట్టణాభివృద్ధి

- కలెక్టర్ రాహుల్‌రాజ్
- బల్దియా పారిశుధ్య కార్మికులకు సన్మానం



పారిశుధ్య కార్మికులను సన్మానిస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్, ఎమ్మెల్యే రామన్న తదితరులు

కైలాస్‌నగర్: ఆదిలాబాద్ పట్టణం కార్పొరేషన్ స్థాయిలో అన్నిరంగాల్లో అభివృద్ధి సాధిస్తుందని కలెక్టర్ రాహుల్‌రాజ్ అన్నారు. రాష్ట్ర అవతరణ దశాబ్ది వేడుకల్లో భాగంగా శుక్రవారం మున్సిపల్ ఆధ్వర్యంలో స్థానిక డైట్ కళాశాల మైదానంలో పట్టణ ప్రగతి దినోత్సవం నిర్వహించారు. ఎమ్మెల్యే జోగు రామన్న, మున్సిపల్ చైర్మన్ ప్రేమేందర్‌తో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రత్యేక రాష్ట్రం సాధించాక ప్రతీవార్డులో మౌలిక సదుపాయాలు, వసతులు కల్పించేందుకు పట్టణ ప్రగతి ద్వారా చర్యలు చేపట్టిందన్నారు. మిషన్ భగీరథ కింద ప్రతీ ఇంటికి నల్లా కనెక్షన్ ద్వారా తాగునీరు సరఫరా చేస్తున్నామన్నారు. ప్రతి ఇంటి నుంచి తడి, పొడి చెత్త సేకరించి డంపింగ్ యార్డుకు తరలించామన్నారు. పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు మున్సిపల్ పారిశుధ్య కార్మికులు నిరంతరం శ్రమిస్తున్నారన్నారు. హరిత పట్టణంగా మార్చేలా 10 శాతం గ్రీన్ బడ్జెట్‌ను కేటాయిస్తున్నట్లు తెలిపారు. ఎమ్మెల్యే రామన్న మాట్లాడుతూ పట్టణ పరిశుభ్రత కోసం నిరంతరం శ్రమిస్తున్న పారిశుధ్య కార్మికుల పని తీరును కొనియాడారు. అనంతరం వారికి ప్రశంసపత్రం అందజేసి శాలువా కప్పి జ్ఞాపికలతో ఘనంగా సత్కరించారు. అతిథులతో పాటు పారిశుధ్య కార్మికులు, మున్సిపల్ ఉద్యోగులు తెలంగాణ రాష్ట్రం ఆకారంలో మానవహారంగా నిల్చోవడం ఆకట్టుకుంది. సాంస్కృతిక సారథి కళాకారుల ప్రదర్శనలు అలరించాయి. అనంతరం అక్కడి నుంచి మున్సిపల్ కార్యాలయం వరకు ర్యాలీ చేపట్టారు. అక్కడ మున్సిపల్ చైర్మన్ జాతీయ పతాకం ఆవిష్కరించారు. గడిచిన తొమ్మిదేళ్లలో మున్సిపల్ సాధించిన ప్రగతిని కమిషనర్ శైలజ వివరించారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ జహీర్ రంజాని, ఆయా వార్డుల కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులు, అధికారులు, సిబ్బంది, పాల్గొన్నారు.

అట్టహాసంగా కూడళ్ల ప్రారంభం



రిమోట్‌తో జంక్షన్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే



విద్యుత్ వెలుగుల మధ్య వినాయక్ జంక్షన్

కైలాస్‌నగర్: పట్టణ సుందరీకరణలో భాగంగా రూ.1.20కోట్ల వ్యయంతో అభివృద్ధి చేసిన వినాయక్ చౌక్ జంక్షన్, రూ.18లక్షలతో అభివృద్ధి చేసిన నేతాజీచౌక్ కూడలిని శుక్రవారం అట్టహాసంగా ప్రారంభించారు. తొలుత బతుకమ్మలు, బోనాలు, డీజే చప్పుళ్ల నడుమ జెడ్పీ చైర్మన్ జనార్దన్ రాథోడ్, ఎమ్మెల్యే జోగు రామన్న నేతాజీచౌక్‌కు చేరుకున్నారు. ప్రత్యేక పూజలు చేసి చౌక్‌ను ప్రారంభించారు. అనంతరం అక్కడి నుంచి ర్యాలీగా వినాయక్‌చౌక్‌కు చేరుకున్నారు. వినాయకుడికి ప్రత్యేక పూజల అనంతరం ఎమ్మెల్యే రిమోట్ ద్వారా జంక్షన్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన బాణాసంచా, లేజర్ షో ఆకట్టుకుంది. తెలంగాణ ప్రగతిని ప్రతిబింబించేలా సాంస్కృతిక సారథి కళాకారులు నిర్వహించిన ఆటాపాట అలరించింది. ఈసందర్భంగా వక్తలు మాట్లాడుతూ, పట్టణ సుందరీకరణలో భాగంగా ప్రతీ చౌక్‌ను అభివృద్ధి చేస్తూ పట్టణానికి ప్రత్యేక శోభను తెస్తున్నామని వెల్లడించారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ జహీర్ రంజానీ, గోపాలకృష్ణ మఠాధిపతి యోగానంద సరస్వతి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

మంత్రిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన వ్యక్తిపై కేసు

సోన్: మంత్రి ఐకేరెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై రవీందర్ తెలిపారు. మండలంలో రాష్ట్ర అటవీ, న్యాయ, దేవాదాయశాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేస్తూ ఓ వీడియోను సువర్ణపురి ఆణిముత్యాలు అనే గ్రూపులో పోస్టు చేసిన సుంకరి నరేష్‌పై శానం గంగాధర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. వీడియో ఎడిట్ చేసిన వ్యక్తి ఎవరో దర్యాప్తు చేసి అతడిపై కేసు నమోదు చేస్తామని ఎస్సై పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సోషల్ మీడియాలో ఇతర వ్యక్తులను, ఇతర వర్గాలను కించపరుస్తూ ఎటువంటి వ్యాఖ్యలు చేయరాదని, ఒక వేళ చేసినా వారికి చట్టపరమైన చర్యలు తప్పవని ఎస్సై హెచ్చరించారు.

శివాజీనగర్‌లో అగ్నిప్రమాదం



ఎగిసిపడుతున్న మంటలు

ఖానాపూర్: పట్టణంలోని శివాజీనగర్ కాలనీలో శుక్రవారం అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. కాలనీలోని శివాజీ విగ్రహానికి సమీపంలో ఇటీవల తొలగించిన వేపచెట్టు కొమ్మలను అక్కడే పడేశారు. ఎండిపోయిన చెట్టుకొమ్మలపైన విద్యుత్‌వైర్లు ఉండడంతో వాటిపై కోతులు దూకుతున్న సమయంలో వైర్లు ఒకదానికొకటి తగిలి నిప్పురవ్వలు వెలువడి చెట్ల కొమ్మలపై పడడంతో మంటలు చెలరేగాయి. గమనించిన స్థానికులు వెంటనే ఫైర్‌స్టేషన్‌కు సమాచారం ఇవ్వడంతో సిబ్బంది చేరుకుని మంటలు ఆర్పివేశారు. రోడ్ల పక్కన పడి ఉన్న చెట్ల కొమ్మలను మున్సిపల్ సిబ్బంది ఎప్పటికప్పుడు తొలగిస్తే ఈ ప్రమాదం సంభవించేది కాదని స్థానికులు పేర్కొంటున్నారు.

అంగట్లో నాలుగు ఫోన్లు చోరీ

గుడిహత్నూర్: మండల కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన అంగడి (సంత)లో నాలుగు స్మార్ట్ ఫోన్లు చోరీకి గురయ్యాయి. బాధితుల వివరాల ప్రకారం.. ప్యాంటు జేబులో ఫోన్లు పెట్టుకుని సంతలోకి వెళ్లామని, అనంతరం ఫోన్లు చూసుకోగా చోరీకి గురైనట్లు గుర్తించామని పేర్కొన్నారు. ఒక్కో స్మార్ట్ ఫోన్ ధర రూ.13వేల నుంచి రూ.40వేల వరకు ఉంటుందని బాధితులు తెలిపారు. ఈ మేరకు తాము పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశామని పేర్కొన్నారు.

డిగ్రీ పరీక్షల్లో ఇద్దరు డిబార్

ఆదిలాబాద్‌టౌన్: జిల్లాలో కేయూ పరిధిలో డిగ్రీ పరీక్షలు కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా శుక్రవారం నిర్వహించిన పరీక్షల్లో ఆదిలాబాద్‌లోని విద్యార్థి డిగ్రీ కళాశాలలో కాపీయింగ్‌కు పాల్పడుతూ పట్టుబడింది. అదే విధంగా మంచిర్యాల జిల్లా జన్నారం అజ్మీరా రేఖా శ్యాం కళాశాలలో ఓ విద్యార్థి కాపీయింగ్‌కు పాల్పడుతూ డిబార్ అయినట్లు కేయూ పరీక్షల విభాగం అడిషనల్ కంట్రోలర్ నరేందర్ తెలిపారు.

ఒకరి ఆత్మహత్య

ఆసిఫాబాద్‌అర్బన్: మతిస్థిమితం కోల్పోయి బావిలో దూకి మండలంలోని బూరుగుడ గ్రామానికి చెందిన అబ్బూరి పంచాక్షరి (45) శుక్రవారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుమారుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ముద్రణ.. సరికొత్తగా



కొత్త పుస్తకాలతో విద్యార్థులు

- విద్యార్థుల నూతనోత్సాహం
- నాణ్యమైన హంగులు, రంగులతో కొత్తపుస్తకాల పంపిణీ..
- సర్కారు పాఠశాలల విద్యార్థుల సంతోషం
- ఆకట్టుకునే నాణ్యమైన ప్రింటింగ్‌తో అందుబాటులోకి..



విద్యాశాఖ పంపిణీ చేసిన పాఠ్యపుస్తకాలు



నాణ్యమైన కవర్‌పేజీలతో కూడిన పుస్తకాలు

నిర్మల్‌ఖిల్లా: బడిగంట మోగి ముచ్చటగా మూడు రోజులు అవుతోంది. జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో కొత్త తరగతుల నూతన పాఠ్యపుస్తకాల పంపిణీ కొనసాగుతోంది. ఈ విద్యాసంవత్సరం తొలిరోజు నుంచే విద్యార్థులకు ఉచిత పాఠ్యపుస్తకాలు అందజేస్తున్నారు. ఈసారి పంపిణీ అయిన పాఠ్యపుస్తకాలు నాణ్యతతో కూడిన కాగితం, ఆయిల్ ప్రింట్‌లతో కూడిన ముద్రణ ఆకట్టుకుంటోంది. పుస్తకాలు అందుకున్న విద్యార్థులు సంతోషం వ్యక్తంచేస్తున్నారు.

కొత్తకొత్తగా...

పాఠశాలలో మనఊరు–మనబడి, పీఎం శ్రీ తదితర పథకాల్లో భాగంగా వసతులు మెరుగుపడగా ఈసారి మధ్యాహ్న భోజనం మెనూలో కూడా మార్పులు చేశారు. వీటితో పాటు నూతనంగా ప్రభుత్వం పంపిణీ చేసిన పాఠ్యపుస్తకాలు కొత్త హంగులతో, నాణ్యతతో తయారు చేసినవి కావడంతో బడులు కొత్తరూపును సంతరించుకుంటున్నాయి. బడుల్లో పుస్తకాలను అందుకున్న విద్యార్థులు మురిపెంగా వాటిని చూసుకోవడం కనిపించింది. ప్రాథమిక విద్యార్థులకు ఆకట్టుకునే చిత్రాలు, కవర్ పేజీలతో కూడినవి కావడంతో వారిలో నూతనోత్సాహం కనిపించింది.

పుస్తకాలకు కోడింగ్ నంబర్లు...

ఈసారి విద్యార్థులకందించే పుస్తకాలు ప్రభుత్వ పంపిణీలో కూడిన కోడింగ్ నంబరుతో ఉన్నాయి. ఒక్కో విద్యార్థికి సబ్జెక్ట్ వారీగా ఒక్కో నంబరు కేటాయించారు. దీంతో పుస్తకాల దుర్వినియోగం ఉండదని అధికారులు చెబుతున్నారు..

చిత్రాలు, రంగులతో కొత్తరూపు...

ఈసారి ప్రభుత్వం పంపిణీ చేసిన పుస్తకాలు ముద్రణ, క్వాలిటీతో సరికొత్త రీతిలో ఉన్నాయి. విద్యార్థులకు చూడగానే ఆకట్టుకునేలా చిత్రాలు, టేబుల్స్, రంగులతో నిండి ఉన్నాయి. ప్రాథమిక స్థాయి విద్యార్థులకు పెద్దపెద్ద బొమ్మలను విభిన్న రంగుల్లో ఆకట్టుకునేట్లుగా నాణ్యమైన పేజీలలో ముద్రించారు. కవర్ పేజీతోపాటు లోపలి పేజీల్లో కూడా పాఠ్యాంశాల వారీగా అందంగా కనిపిస్తున్నాయి. పెద్ద తరగతుల వారికి కూడా ఆయా సబ్జెక్టు పుస్తకాలలో క్యూఆర్ కోడ్‌తో కూడిన వీడియో వివరణలు అందుబాటులో ఉంచారు. పుస్తకంలో ఇచ్చిన క్యూఆర్ కోడ్‌ని మొబైల్ ఫోన్ స్కానర్ ద్వారా స్కాన్ చేసిన వెంటనే సంబంధిత విషయం యొక్క అదనపు సమాచారంతో కూడిన వీడియోలు అందుబాటులోకి వచ్చేలా విద్యాశాఖ ఏర్పాట్లు చేసింది. దీంతో గ్రామీణ ప్రాంతాల్లో విద్యార్థులతో పాటు వారి తల్లిదండ్రులు సైతం కొత్త టెక్స్ట్ బుక్స్ పట్ల ఆసక్తిని కనబర్చుతున్నారు.

బాధిత కుటుంబానికి రూ.5.20లక్షల నష్టపరిహారం

- శాంతించిన మృతుడి కుటుంబీకులు
- ఎట్టకేలకు పూర్తయిన అంత్యక్రియలు



వికాస్ (ఫైల్)

జైనథ్: వైకుంఠధామం బిల్లులు రాక ఆత్మహత్య చేసుకున్న నిపల్ వికాస్ కుటుంబ సభ్యులకు గ్రామ సర్పంచ్ భర్త రాములు రూ.5 లక్షల నష్టపరిహారం ప్రకటించడంతో ఎట్టకేలకు అంత్యక్రియలు పూర్తయ్యాయి. గురువారం రాత్రి వరకూ కుటుంబీకులు మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం తరలించేందుకు ఒప్పుకోలేదు. దీంతో పోలీసులు కూడా చేసేదేమీ లేక అక్కడే ఉండిపోయారు. శుక్రవారం ఉదయం వికాస్ అంత్యక్రియలకు రూ.20వేలు, కుటుంబ సభ్యులకు రూ.5లక్షలకు ఇస్తామని సర్పంచ్ భర్త ముందుకు రావడంతో కుటుంబీకులు శాంతించారు. దీంతో పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ఆదిలాబాద్ రిమ్స్‌కు తరలించారు. అనంతరం సాయంత్రం అంత్యక్రియలు నిర్వహించారు.

అనుమానాస్పద మృతిగా కేసు నమోదు..

వికాస్ ఆత్మహత్యతో గ్రామంలో ఒక రకమైన ఉత్కంఠత ఏర్పడింది. మృతదేహాన్ని ఎప్పుడు తరలిస్తారు? కేసు ఎలా నమోదు చేస్తారు? ఎఫ్ఐఆర్‌లో ఎవరెవరి పేర్లు ఉంటాయనేది చర్చనీయాంశమైంది. వికాస్ కుటుంబానికి రూ.5 లక్షల నష్ట పరిహారం ప్రకటించిన తర్వాత పరిస్థితులు మారాయి. పోస్టుమార్టం అనంతరం వికాస్ అనుమానాస్పద స్థితిలో మృతిచెందినట్లు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. వికాస్ తండ్రి హీరామన్ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో బిల్లులు రాక మనస్తాపంతో తన కుమారుడు ఆత్మహత్య చేసుకున్నట్లు పేర్కొన్నారు. దీంతో ప్రస్తుతం అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసుకొని దర్యాప్తు ప్రారంభించినట్లు సీఐ కోల నరేష్ తెలిపారు.

ప్రారంభం కాదు... మూసివేతనేనా?



పరికరాలు బయటకు తీసుకొస్తున్న దృశ్యం

బోథ్: మండల కేంద్రంలో 13ఏళ్ల క్రితం ప్రారంభించిన పాలశీతలీకరణ కేంద్రం పదేళ్ల క్రితం మూతపడింది. అప్పటి నుంచి పాలశీతలీకరణ కేంద్రాన్ని ప్రారంభించడానికి అధికారులు, ప్రజాప్రతినిధులు ఎలాంటి చర్యలు తీసుకోలేదు. దీంతో ఇక్కడి రైతులు పాడి పరిశ్రమకు దూరమయ్యారు. ఈ నెల 15వ తేదీన విజయ డెయిరీ డెప్యూటీ డైరెక్టర్ మధుసూదన్ పాలశీతలీకరణ కేంద్రాన్ని పరిశీలించారు. దీంతో పాలశీలీకరణ కేంద్రం తిరిగి ప్రారంభమవుతుందని రైతులు ఆనంద పడ్డారు. కానీ ఆ సంతోషం ఒక్క రోజు కూడా నిలువలేదు. శుక్రవారం పాలశీతలీకరణ కేంద్రంలోని ట్యాంకు, పరికరాలు, వస్తువులను అధికారులు తీసుకెళ్లడానికి ప్రయత్నించారు. దీంతో మార్కెట్ యార్డులోని రైతులు అడ్డుకున్నారు. రైతులు సంబంధిత అధికారులకు ఫోన్ చేయగా ఆసిఫాబాద్ తరలిస్తున్నట్లు పేర్కొన్నారు. కాగా ఓ కాంట్రాక్టర్ మాత్రం ట్యాంకర్‌ను భైంసా వద్ద గల ఓ గ్రామానికి తరలిస్తున్నట్లు చెప్పినట్లు రైతులు పేర్కొన్నారు. ఈ తరలింపు మాత్రం పలు అనుమానాలకు తావిస్తోంది.

కుంటాలకు ట్రైనీ అటవీ శాఖాధికారులు



కుంటాల జలపాతం వద్ద ట్రైనీ అధికారులు

నేరడిగొండ: దేశంలోనే ఎత్తైన జలపాతంగా పేరొందిన కుంటాల జలపాతాన్ని శుక్రవారం ట్రైనీ అటవీ శాఖాధికారులు సందర్శించారు. ఏసీడీ రాంమోహన్‌తో కలిసి జలపాతం అందాలను తిలకించారు. ఈ సందర్భంగా వారికి సిరిచెల్మ అధికారి వాహబ్ అహ్మద్ స్వాగతం పలికి రేంజ్ విశిష్టతలు, కుంటాల జలపాతం ప్రాముఖ్యతపై వివరించారు. ఈ కార్యక్రమంలో కుంటాల ఎఫ్ఎస్‌వో వసంత్ కుమార్, ఎఫ్‌బీవోలు సచిన్, భైరుబాయి పాల్గొన్నారు.

ఆనందాన్ని కబళించిన మృత్యువు

- వీఆర్‌ఏలను రెగ్యులర్ చేస్తామని ప్రకటించిన ప్రభుత్వం
- ధ్రువపత్రాలు ఇచ్చేందుకు వెళ్తూ వడదెబ్బకు గురైన వీఆర్‌ఏ
- రిమ్స్‌లో చికిత్స పొందుతూ మృతి



కుర్మె అశోక్ (ఫైల్)

బోథ్: ఎన్నో ఏళ్లకు ప్రభుత్వం రెగ్యులర్ చేస్తామని ప్రకటించడంతో వీఆర్‌ఏలు పట్టలేని ఆనందంలో ఉన్నారు. ఈ క్రమంలో తమ ధ్రువ పత్రాలను స్థానిక తహసీల్ కార్యాలయంలో అందించాలని పేర్కొనడంతో ఇంటి నుంచి సంతోషంగా వచ్చిన ఓ వీఆర్‌ఏను వడదెబ్బ రూపంలో మృత్యువు కబళించింది. మండలంలోని కరత్వాడ గ్రామానికి చెందిన కుర్మె అశోక్(48) వీఆర్‌ఏగా విధులు నిర్వహిస్తున్నాడు. ప్రభుత్వం వీఆర్‌ఏలను రెగ్యులర్ చేస్తామని ప్రకటించిన నేపథ్యంలో బోథ్ తహసీల్దార్ కార్యాలయానికి గురువారం తన ధ్రువపత్రాలు ఇచ్చేందుకు వెళ్లాడు. అప్పటికే ఎండ తీవ్రంగా ఉండడంతో కొంత అస్వస్థతకు గురయ్యాడు. తిరుగు ప్రయాణంలో వడదెబ్బకు గురయ్యాడు. ఇంటికి వెళ్లి వాంతులు చేసుకోవడంతో కుటుంబీకులు బోథ్‌లోని ప్రధాన ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం ఆదిలాబాద్ రిమ్స్‌కు తరలించగా శుక్రవారం ఉదయం మృతిచెందాడు. అశోక్‌కు గతంలో గుండెకు సంబంధించిన ఆపరేషన్ అయినట్లు స్థానికులు పేర్కొన్నారు. మృతుడికి భార్య భారతి, కుమారుడు చరణ్ తేజ, కూతురు సుదీక్ష ఉన్నారు.

ప్రమాదవశాత్తు బావిలో పడి ఒకరి మృతి

ఆదిలాబాద్‌రూరల్: మండలంలోని జందాపూర్ గ్రామానికి చెందిన అనుముల భూమన్న (67) ప్రమాదవశాత్తు బావిలో పడి గురువారం మృతి చెందినట్లు ఆదిలాబాద్ రూరల్ పోలీస్‌స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ గోవింద్‌రావ్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. జందాపూర్ గ్రామానికి చెందిన భూమన్న పశువుల కాపరిగా పని చేస్తూ జీవనం కొనసాగిస్తున్నాడు. రోజు మాదిరిగానే గురువారం పశువులు మేపడానికి వెళ్లాడు. సాయంత్రం 6గంటల ప్రాంతంలో పశువులు ఇంటికి వచ్చినా భూమన్న రాలేదు. దీంతో గాలింపు చర్యలు చేపట్టగా గ్రామ శివారులోని ఓ రైతు వ్యవసాయ పొలంలోని బావి వద్ద చెప్పులు కనిపించాయి. బావిలో దిగి చూసే సరికి భూమన్న మృతదేహం కనిపించింది. నీళ్లు తాగేందుకు వెళ్లి ప్రమాదవశాత్తు బావిలో పడి మృతిచెంది ఉండాడని భావిస్తున్నారు. కేసు ఫిర్యాదు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

కొత్తపల్లి ఎస్సీగూడలో నీటి కష్టాలు



కొత్తపల్లి ఎస్సీగూడలో తాగునీటి కోసం గ్రామస్తుల తిప్పలు



బావివద్ద నీళ్ల కోసం ఖాళీ బిందెలతో బారులుతీరిన గ్రామస్తులు

- సరఫరా కాని మిషన్ భగీరథ నీళ్లు

నార్నూర్: ఎండలు భగభగ మండుతున్నాయి. ఇంటి నుంచి బయటకు వెళ్లాలంటే జనాలు జంక్కుతున్నారు. మధ్యాహ్నం గ్రామాల్లో కర్ఫ్యూ వాతావరణాన్ని తలపిస్తోంది. ఎండలను సైతం లెక్క చేయకుండా మండుటెండల్లో నీటి కోసం ప్రజలు పడరాని పాట్లు పడుతూనే ఉన్నారు. అయినప్పటికీ అధికారుల్లో చలనం లేదు. పైగా గ్రామాలకు మిషన్ భగీరథ ద్వారా ఇంటింటికీ నల్లా ద్వారా నీటిని అందిస్తున్నామని ప్రసంగాలు చేసే పాలకులు పట్టించుకోవడం లేదు. గ్రామాలు ఏర్పడి 70ఏళ్లు అవుతున్నప్పటికీ నేటికి నీటి కష్టాలు మాత్రం తీరడం లేదని మారుమూల గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గాదిగూడ మండలంలోని కొత్తపల్లి ఎస్సీగూడలో నీటి కోసం గ్రామస్తులు పడరాని పాట్లు పడుతున్నారు. రెండు వారాలుగా మిషన్ భగీరథ నీరు సరఫరా కాకపోవడంతో గ్రామ సమీపంలోని బావి వద్ద ఖాళీ బిందెలతో బారులు తీరాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మిషన్ భగీరథ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. బావిలో సైతం నీళ్లు అడుగంటిపోవడంతో బిందె నీళ్ల కోసం అరగంట వేచిచూడాల్సి వస్తోందని మహిళలు వాపోతున్నారు. నీటి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఉరేసుకుని యువతి ఆత్మహత్య



రవళి మృతదేహం

ఉట్నూర్‌రూరల్: ఇంట్లో తల్లిదండ్రులకు తరుచుగా గొడవలు పడుతుండడంతో మనస్తాపంతో కూతురు ఆత్మహత్య చేసుకున్న ఘటన శుక్రవారం మండలంలో చోటుచేసుకుంది. ఉట్నూర్ ఎస్సై మహేశ్ వివరాల ప్రకారం... శ్యాంపూర్ గ్రామానికి చెందిన మక్కల రాములు–శాంతలకు ఇద్దరు సంతానం. చిన్న కుమార్తె రవళి (18) ఇంటర్ చదివి ఇంటి వద్దే ఉంటోంది. తల్లిదండ్రులు తరచు గొడవలు పడుతుండేవారు. దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన రవళి ఇంట్లో ఎవరులేని సమయంలో చీరతో దూలానికి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. తండ్రి కూలీ పనులకు వెళ్లి వచ్చి చూడగా దూలానికి వేలాడుతూ కనిపించింది. వెంటనే ఉట్నూర్ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందినట్లు పేర్కొన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

వంతెనకు ఢీకొని ఒకరి మృతి



దత్తు మృతదేహం

తలమడుగు: మోటార్ సైకిల్‌తో వంతెనకు ఢీకొని ఒకరు మృతిచెందిన సంఘటన మండలంలో శుక్రవారం చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం ... మహారాష్ట్రలోని యావత్‌మాల్ జిల్లా మంగిసవార్గంకు చెందిన దత్తు (40) స్నేహితుడితో కలిసి కుప్టి గ్రామంలో తన బంధువుల అంత్యక్రియలకు వచ్చాడు. తిరుగుప్రయాణంలో సోనాపూర్ గ్రామ సమీపంలోని బ్రిడ్జికి బైక్‌తో ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో దత్తు అక్కడికక్కడే మృతి చెందగా మరో వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. సంఘటనా స్థలాన్ని ఎస్సై అప్పారావు పరిశీలించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఆధునిక హంగులతో నిర్మల్ ఆర్టీసీ

- కమర్షియల్ కాంప్లెక్స్ నిర్మాణానికి శంకుస్థాపన
- హాజరైన మంత్రి అల్లోల, ఆర్టీసీ చైర్మన్ బాజిరెడ్డి



శంకుస్థాపన చేసిన మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి, ఆర్టీసీ చైర్మన్ బాజిరెడ్డి గోవర్ధన్‌రెడ్డి

నిర్మల్‌టౌన్: ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడంతో పాటు , ప్రత్యామ్నాయ ఆదాయ మార్గాలపై ఆర్టీసీ దృష్టి సారించిందని, ఇందులో భాగంగా నిర్మల్ బస్టాండ్ ఖాళీ స్థలంలో వాణిజ్య సముదాయాన్ని నిర్మిస్తున్నట్లు మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి , టీఎస్ ఆర్టీసీ చైర్మన్, శాసన సభ్యులు బాజిరెడ్డి గోవర్ధన్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో రూ.34.43 కోట్లతో ఆధునిక హంగులతో నిర్మిస్తున్న నిర్మల్ ఆర్టీసీ కమర్షియల్ కాంప్లెక్స్‌కు మంత్రి, టీఎస్ ఆర్టీసీ చైర్మన్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి అల్లోల మాట్లాడుతూ సీఎం కేసీఆర్ రాష్ట్రంలోని అన్నీ బస్టాండ్లను అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు. ఈ కమర్షియల్ కాంప్లెక్స్‌లో పార్కింగ్ సదుపాయం కోసం సెల్లార్, జీ ప్లస్ –3 నిర్మాణంలో 53 స్టాళ్లను, శుభకార్యాలు నిర్వహించేందుకు ప్రత్యేక హాలును నిర్మిస్తున్నామని తెలిపారు.

మంత్రి అల్లోల మా జిల్లా అల్లుడు..

మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి మా నిజామాబాద్ జిల్లాకు చెందిన అల్లుడని, తనతో ఎన్నో ఏళ్ల స్నేహం ఉందని చైర్మన్ బాజిరెడ్డి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. అంతేకాకుండా నిర్మల్ బస్టాండ్‌పై తనతో ఎన్నోసార్లు చర్చించినట్లు తెలిపారు. అనంతరం వారు బస్టాండ్ పరిసరాలు పరిశీలించారు. ప్రియదర్శినినగర్ వెళ్లే రోడ్‌ను పరిశీలించి 40ఫీట్ల సీసీ రోడ్ విస్తరణకు ప్రణాళికలను రూపొందించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఇందులో కలెక్టర్ వరుణ్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ గండ్రత్ ఈశ్వర్, ఆర్టీసీ కరీంనగర్ జోన్ ఈడీ వినోద్ కుమార్, రీజినల్ మేనేజర్ జానీరెడ్డి, డిపో మేనేజర్ సాయన్న, మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక రమణ, ఎఫ్ఎస్సీఎస్ చైర్మన్ రాజేందర్, ప్రముఖ పరిశ్రామిక వేత్త అల్లోల మురళీధర్‌రెడ్డి, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు మరుగోండ రాము పాల్గొన్నారు.



నిర్మాణ స్థలాన్ని పరిశీలిస్తున్న మంత్రి, ఆర్టీసీ చైర్మన్



మాట్లాడుతున్న మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి



ప్రయాణికులతో మాట్లాడుతున్న ఆర్టీసీ చైర్మన్